కవితా కౌముది

# నేను..పుస్తకాన్ని

ఎన్.నరేశ్ చారి

నేనూ.......పుస్తకాన్ని
నన్ను గుర్తుపట్టారా..?
ఎందుకు గుర్తు పడతారు
నేను  మీ ఆత్మీయ నేస్తమైన
సెల్ ఫోనంత ఖరీదైందాన్నికాదు
అందమైందాన్ని కాదు
నాజూకైందాన్ని అసలే కాదు
అందుకేగా నేనంటే మీకంత చులకన!?
ఒకప్పుడు రాజులు, నవాబులు
నన్ను అంకితం పుచ్చుకోవడాన్ని
ఎంత గౌరవంగా భావించేవారో!
నాలో వారి పేర్లను
శాశ్వతంగా లిఖించుకోవడానికి
ఎంతగా తహతహలాడేవారో !
ఎన్నెన్ని యుద్ధాలు చేసేవారో!
సెల్ ఫోన్ మత్తులోపడి
నన్ను వదిలేసిన మీకేం తెలుసు ?
నన్ను కొనుక్కోవడానికి
ఎంతమంది చిరిగిన చొక్కా తొడుక్కున్నారో!
నన్ను చదవడానికి
ఎంతమంది జ్ఞానార్థులు
గ్రంథాలయానికి పరుగులెత్తే వారో !
ఈ చరవాణీ హస్తభూషితులకేంతెలుసు ?
మీచేతిలో
చందమామ కథల పుస్తకాన్నై
మీలో ఊహాశక్తిని పెంచింది నేనుకదూ!
మీ చేతిలో
బాలమిత్ర కథల పుస్తకాన్నై
మీలో భావుకత పెంచింది నేనుకదూ!
మీ చేతిలో
పంచతంత్ర కథల పుస్తకాన్నై
మీలో నైతికవిలువలను కూర్చింది నేనుకదూ!
మీ చేతిలో మత గ్రంథాన్నై
మీలో ఆధ్యాత్మికతను పెంచింది నేను కదూ!
నా చల్లని చేతి స్పర్శను మీకందించి
మిమ్మల్ని మేధావులుగా తీర్చిదిద్దింది నేను కదూ!
రేయింబవళ్లు మీకు తోడై నిలిచి
ఉద్యోగంతో మీకొక దారి చూపింది నేనుకదూ!
మీరు చూస్తున్న ఈ సాంకేతిక విప్లవ సౌధానికి
మూలాన్ని నేనుకదూ!
మీ విలువల వలువలకు దారాన్నైనిలిచి
మిమ్మల్ని ఉన్నతులుగా తీర్చిదిద్దింది నేనుకదూ!
ప్రాచీన కాలాన్ని ఆధునిక కాలంతో
అనుసంధానిస్తున్న  జ్ఞానవారధిని నేను
ఎన్ని ఆకృతులు నావని
ఎంత చరిత్ర నాదని
చరిత్రనే ఇముడ్చుకున్న చరిత్ర కదా నాది
అందుకేనేమో...! కూసింత గర్వం నాకు!!
సెల్ ఫోన్ మోజులో పడి
మీరు నన్ను దూరం పెట్టినా
మిమ్మల్ని మాత్రం నా గుండెల్లో దాచుకుంటా
నన్ను అప్పుడప్పుడైనా కాస్త పలకరించండి
నాకు బంధువులున్నారని మురిసిపోతా
అనుకోకుండానైనా నావైపు ఓసారి తొంగి చూడండి
నా కోసం ఎదురు చూసే ఆత్మీయులు
నాకూ ఉన్నారని సంబరపడతా
నన్ను కాస్త ప్రేమగా తడమండి
నాకూ ఆప్తులున్నారని ప్రపంచానికి చాటుతా
నాకు కాస్త మీ ప్రేమను ఇవ్వండి
ప్రతిగా నేను  జ్ఞానాన్నిచ్చి మీ ఋణం తీర్చుకుంటా !!

★★★

# ఆ ..దృశ్యం

సుధామురళి

దేహమిప్పుడు విచ్చుకత్తుల సమూహం
కూలిపోవడమే
రక్తాలు ధారలు కడుతూ
లేవడం....నిలదిక్కుకోవడం
కలల్లోనూ కలగనలేం

ఏ మాటా పెగలకూడదు
అసలు ఏ మౌనం బైటపడకూడదు
నుసి నుసిగా నువ్వు రాలిపోవాలి
బూడిద కుప్పలా కూడా మిగలకుండా
దొరకని గాలిలో ధూళిలా రేగిపోవాలి
శరాఘాతాల సాంగత్యం నీకు కొత్తగా అనిపించకూడదు
కృష్ణబిలాలూ
ఉల్కాపాతాలూ
ఏవీ పెను ప్రమాదాలుగా నువ్వు భావించకూడదు
నిన్ను నువ్వే శత్రువును చేసుకుంటూ
నీ గుండెనే నీకో రణక్షేత్రంగా మార్చేసుకుంటూ
నువ్వున్నావో లేవో అనే సంశయాన్ని
నీలో నువ్వే అప్పచెప్పేసుకుంటూ
ఇన్ని టూల మధ్యన
తోక తెగిన తోకచుక్కలా కూలిపోవాలి
నివాళి దొరకని ప్రదేశంలో
మృత్యు జావళి పాడుకుంటూ
అదృశ్యమైపోవాలి

ఆ....దృశ్యమ్
ఇక్కడ అదృశ్యమై పోవాలి.....!!

★★★★

# బ్రతుకు బాట
## అర్చన కోవూరు

మేరు నగము ఢీకొన మేఘమునకెంత ముచ్చట
కురియగానె భారమంత సాగిపోవు తేలికగా,
ఓదార్చు ఒడిని చేర శిరమునకెంత సాంత్వన
మనసు పడిన ఆర్తమె కన్నీరుగ మారగా,
సృష్టికి ప్రతిసృష్టి చేయ తల్లి పడే వేదన
ముద్దులొలుకు పసి పాపల మోముకాంచి మురియగ,
కడలి చేర బిర బిరా నదులకెంత యాతన
కలిసిపోగ ఉనికి మరచి గమ్యంనే చేరగా,
క్రుంగు మదికి రెక్క చాచు పక్షి ఎంత ప్రేరణ
తరచి చూడ తరుణములే నింగి నేల హద్దుగా,
తనివితీర నాట్యమాడ మువ్వకెంత తపన
నవ రస తాళ భంగిమలే పలికించగా,
పరుల మేలు మదిని తలచె ప్రార్థనెంత కమ్మన
భేదభావ రహిత భవితవ్యం బాసటగ
మగువ కురులు చేరగ మల్లెపూలకెంత వేడుక
పరవశించు ప్రాణనాథ మనసునెంచ బిడియంగా,
గుండె దాటి బయట పడగ తలపులకెంత ఆత్రమొ
పంచుకొనగ ప్రేమతీర వలపులన్ని తియ్యగా,
ధరణి చెరను వీడి పెరుగ పైరుకెంత పంతమొ
బ్రతుకు కోరె బాటసారి ఆకలినే తీర్చగ,
వేచి చూడ ఆ క్షణమునకై కుసుమాలకెంత సహనమొ
ఈశుని పాదాల చెంత మోక్షమునే పొందగా,
పదములుగా మారగ అక్షరాలకెంత ఆశనో
ఆలపించ ఆలయాన భక్తి రాగ కీర్తనగా,
ఊపిరిగా మారాలని గాలికెంత తపన
వేణు గానమై మధురముగా అధరమునే తాకగా,
భక్తి మీర భజన చేయు భక్తుడెంత ధన్యమో
మదియంతా భగవంతుని నామ స్మరణ నిండగా,
ఉలి చాటున మలవగా రాయి దెంత పుణ్యమో
ప్రాణ కోటి అర్చించగ అమ్మవారి రూపుగా,
పాపులని భరియించగా పుడమితల్లికెంత కరుణనో
ప్రకృతి కాంతని పరిరక్షించగ పడుగు అడుగులకాసరగ,
కలము తాకి కాగితాన వ్రాల కవితకెంత కాంక్షయో
గళం కదిపి జనం మెచ్చ రసానుభూతినే పొందగా!!!

★★★

# మనసు గుహ
## చందలూరి నారాయణ రావు

కళ్ళను
ఎక్కడకు పంపకు.
గుండె గూటికి దూరంగా...

ఎక్కడో మునిగిన నిద్రలో
ఏది పడితే దాన్ని
"కల"గా మోసుకొస్తే?

తీరే దారి దొరక్కపోతే
కాళ్ళు వెనక్కు నడిస్తే?

నిద్రకు నిద్ర రాక
కల భయపడితే?

మనిషి
మనసు గుహలా సమాధి.

ప్రేమకు
ఎప్పుడూ చీకటె.

★★★

# రసరేఖలు
శ్రీధర్ బచ్చోటి

కనులనుండి యశ్రువులేల కారుచుండె
కొట్టుమిట్టాడు వగపేల గుండెలోన
కారణమ్మునుండి యొకనాడు కలుగునార్తి
హేతువే లేక నేడు రోదింతునేల

వలయునానందమిలలోని వారికెల్ల
వగపు లేమియే చిరకాలవాంఛ మనది
వలదు వ్యథయందురర్థాని తెలియు వారె
హృదయమెరుగునే క్లేశరాహిత్యమేమొ

ఇడుమలెరుగని జీవితమెట్టులుండు
మనకు తెలియదు లేని వానిని గురించి
లేనిచో సంతతమ్మది లేనిదగును
ఊహకందని స్థితి దాని యోగ్యతేమి

కష్టములు బోధ చేయు సౌఖ్యంపు విలువ
భోజనమునకు విలువ బుభుక్ష వలన
అశ్రువులు చెప్పునానందమన్ననేమొ
ద్వంద్వములు లేక చేతనత్వమ్ము లేదు

చల్లదనమును వలయునుష్ణమ్ము వలయు
వలయు కన్నీరు నగవును వలయు మనకు
తనివి తీరగనేడ్చిన తనియు మనసు
వాన వెలియును నీరెండ పలుకరించు

COMMENTS